దిస్ ఇజ్ సింపుల్ డిసీట్. ట్రిక్, ఫేక్, కన్నింగ్, ఎడల్టరీ, హిపోక్రసీ, హాండ్ గివింగ్, వాట్ నాట్!... తక్షణం అయన అంతు తేల్చుకుంటాను. ఇంతకి తెగిస్తాడా!... హుఁ!''

'' తేల్చుకోండి, తేల్చుకోండి, ఆయనిప్పుడు లాయరు గారింట్లోనే ఉన్నాడు ''

'' లాయరుగారింట్లోనా , ఎందుకూ?'' .. '' ఎందుకా, బండి రిజిస్ట్రేషను చేస్తున్నప్పుడు రాతలో మీరు ఆయనకి దొరికిపోయారుట. మీరు సెంట్రల్ బాంక్ ఆఫ్ ఇండియాలో పన్చేస్తున్నట్లు ఆయనెదురుగా రిజిస్ట్రార్ ఆఫీసులో అప్లికేషను రాసిచ్చార్టగా! మిమ్మల్ని కలవటం కోసం ఆయన నిన్న బాంక్ కెడితే మీరు వర్క్ చేస్తున్నది ఆ బాంక్‌లో కాదనీ కో ఆపరేటివ్ సెంట్రల్ బాంక్‌లోననీ తేలింది! రామబాణంలాగా ఆయన రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్ళి పోయి మీ స్వహస్తాల్తో రాసిన అప్లికేషన్ తాలూకూ ఫోటోస్టాట్ కాపీని సంపాదించేసాడు, తననీ, బాంక్‌ని మోసం చేసినట్టు మీ మీద కేసు పెట్టపోతున్నాడు. వింటున్నారా?'' .. '' ఊఁ'' ... '' ఆయన స్కూటర్ని ఆయనకిచ్చేస్తేనే గాని మిమ్మల్ని వదిలేట్టులేదు!''
''......'' ''' అరె, అదేంటి, మాటా పలుకూ లేకుండా అట్లా హటాత్తుగా లేచెళ్లిపోతున్నారేంటి సార్, మీ అప్పీలు కేసెప్పుడు పెడతారు?... మీరు కుడి రోడ్డు కెళ్తున్నారేంటి సార్! లాయర్ గారిల్లు ఎడమ రోడ్డులోనండి బాబూ! ఇటు, ఇటు.. ప్చ్. ఇప్పట్లో ఇంకీ చుట్టుపక్కల కనిపించడు కాబోలు, పూర్ ఫెలో!...''

(ఆంధ్రసచిత్రవారపత్రిక 4-11-83)

★★★ ★★★ ★★★

# సుందరీ- యోగమూ

'' అబ్బ వదలండీ, వాళ్ళొచ్చి చూశారంటే అల్లరైపోతాం'' అంది, తన చెయ్యి విడిపించుకునే ప్రయత్నంలో ఆయాసపడుతూ సుందరి. '' నువ్విక్కడ మేడమీద దాక్కున్నావని వాళ్ళకెట్లా తెలుసు, వాళ్ళిక్కడికి రార్లే '' అంటూ సుందరి చెయ్యి వదలకండానే ఆమెని తన వైపు లాక్కున్నాడు యోగారావు.

''మీకు తెలీదండీ బాబూ, వాళ్ళసలే అల్లరి వాళ్ళు ఎక్కడికైనా వస్తారు. మంజరి అయితే పర్వాలేదు, అర్థంచేసుకోగలదు. దానికి పెళ్ళయింది కాబట్టి. మండితం, రంజితం, శింజితం, అంజనలు అసలే గడుగ్గాయిలు, పైగా పెళ్లీ పెటాకులూ లేనివాళ్ళు. ఏదో చిన్న నాటి వాళ్ళం గదాని, విడిదిల్లు స్వేచ్ఛగా దొరికింది గదాని ఆడుకుంటున్నాం. తమరిక్కడున్నారని తెలిస్తే దాక్కోడానికి నేను మేడమీదికి రాకనేపోదును, ఈ గదిలోకి అడుగు పెట్టకనే పోదును. వదలండీ ప్లీజ్! .. అభాసయిపోతామండీ బాబూ!''

యోగారావు సుందరిని వదల్లేదు. పైపెచ్చు ఆమె చెయ్యొదిలేసి నడుం పట్టుకుని చటుక్కున తనవైపు గుంజుకున్నాడు. ఆ ఊపులో, అంత వరకూ యోగారావు పడుకుని చదువుకున్న పడక్కుర్చీ నేలమీదికి ఇద్దరూ పడి, లోపలికి జారారు. యోగారావు కిందా, సుందరి పైనా. కోణం కుదరక యోగారావు

సర్దుకోసాగాడు. అతని మోచేతులూ మోకాళ్ళు వగైరా పోట్లు సుందరికి తగలసాగాయి. సుందరంది

" అదుగో అదుగో! అస్స్ అబ్బబ్బ!... ఉఁహ! నా పరువు .. దక్కనివ్వరు... మీ రివ్వాళ... ఇస్స్!... వాళ్ళొచ్చి . "

యోగారావన్నాడు " అసలే తెల్లవారుజామున ముహూర్తం! ఓ పక్కన ఆ పెళ్ళి జరుగుతూండగా నేను చూసేట్టుగా మీ ఫ్రెండ్సుతో కలిసి నువ్వు చేసిన అల్లరి కొంతా, ఆపైన యాభైసార్లు నన్ను నువ్వు రాచుకుంటూ నడవటం కొంతా- ఇవన్నీ ఊరికేపోయాయనుకున్నావా! యమగీరగా ఉంది!... ప్చ్,ప్చ్... అసలు నువ్వెక్కడున్నావో వెతుకుదామని నేనే... ప్చ్చ్ . "

కింద మేడమెట్లదగ్గర కేకలు వినిపించ సాగాయి. " ఎక్కడున్నావే సుందరీ!.. సుందరీ, సుందరీ!... ఫష్టుఛాన్సు దీనికెవరిచ్చారే బాబూ! ఇల్లూవాకిలీ, దొడ్డీ, బాత్రూమూ పడగ్గదీ- ఎక్కడా లేకుండా ఎక్కడ దాక్కుందో అల్చిప్పమొహం!... సుందరీ, సుందరీ!..."

" ఈ ఇంట్లో కాకుండా పక్కింటి కెళ్ళి దాక్కుందేమో!"

" ఆహ్! తోలొలుస్తాం అట్లాంటి పిచ్చిపని చేస్తే!... ఆటకి రూల్సున్నాయ్ తెల్సుకోమరి" ... " "ఒసేవ్, మేడమీద దాక్కుందేమోనే!... చూసొస్తానాగు!" మేడమెట్లు కొంతవరకూ ఎక్కిన చప్పుడు విని పైన గదిలో సుందరి అదిరిపోయింది. తన భర్తనుంచి విడిపించుకోవాలని ఆఖరిసారిగా గుంజుకుంది. మళ్ళీ మాటలు వినిపించాయ్ కిందినుంచి.

" ఆ మేడమీద్ది సామాన్లగదేబాబూ! దాన్నిండా పాతకుర్చీలు, పాతపరుపులూ, పాతవీక్లీలు ఇంకా వుంటే గింటే దయ్యాలూ భూతాలూను! దిగుదిగు!"

" సరేపద... అన్నట్లొసేవ్, దొడ్లో ... దొడ్లో బాదంచెట్టుగాని ఎక్కిందేమోనేవ్!... రైట్ పదండి, పదండి!"

పైన గదిలో యోగారావు, " గుడ్, మీ ఫ్రెండ్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు మనకి!" అన్నాడు. సుందరి మాట్లాడ్లేదు.

అక్కడున్న పాతదిండ్లు రెండు తీసి దులిపాడు యోగారావు. గోడకి చాపపరిచాడు. గడియ లూడిపోయిన పాతగది తలుపుని దగ్గరికి చేరేసి, అది తెరుచుకోకండా పాత వీక్లీల కట్టొకటి అడ్డంగా పెట్టాడు. సుందరిని అమాంతం కౌగలించుకున్నాడు. గువ్వలాగా అతని కౌగిట్లో ఒదిగిపోయింది సుందరి...!!

మళ్ళీ మెట్ల దగ్గర వినవచ్చిన రణగొణ ధ్వనికి యోగారావుకి మెలకువ వచ్చింది. " ఏమే రంజితం, గదుల్లో ఎక్కడా లేనట్టే గదా, చుట్టూ స్థలంలో కూడా ఎక్కడా లేనట్టే గదే అంజనా, సరే చెట్లూ చేమలూ నేను శోధించేసాన్లే... ఇంక స్థిరమైపోయిందే ఆ సుందరి - కాదు బందరి తట్టదగలేసి ఎక్కడికో లేచిపోయింది!... కనీసం ఈ ఇంట్లో ఎక్కడా లేదు, ఏవంటారు?"

కొన్ని క్షణాల సేపు గుసగుసలు వినిపించాయి. చివరికి ఒక గొంతు అంది " ఈ మేడకూడా.. చూస్తే ... అంటే ఆఖరి ప్రయత్నంగా .." మళ్ళీ గుసగుసలు వినిపించాయి.

యోగారావు గుండె వేగం మళ్ళీ హెచ్చింది. ఈసారి కంగారుతో చటుక్కున లేచి చూసాడు. సుందరి గోడకానుకొని అదే స్థితిలో మగత నిద్రలో వుంది. అతను, తన లుంగీ సరిచేసుకున్నాడు చొక్కా వేసుకున్నాడు. సుందరి బట్టలు సరిచేసాడు. ఎందుకైనా మంచిదని పరుపుల గుట్టలోంచి పాత దుప్పటొకటితీసి ఆమె మీద కప్పాడు. పాత వీక్లీ ఒకటి అందుకొని గది తలుపు తెరవబోయాడు. కిందనించి మాటలు వినిపించాయి.

" ఎందుకైనా మంచిది, నేనొకసారి పైకెళ్ళి గదిలో కూడా చూపొస్తానే మీరిక్కడే ఉండండి" అన్న మాటల్తో బాటు ఆ వెంటనే మెట్లెక్కుతున్న చప్పుడు వినిపించింది.

యోగారావు అదిరిపోయాడు. చటుక్కున గది బయటకి నడిచాడు. తలుపు మళ్ళీ మూసేసి ఆ సందులోంచే వీక్లీల కట్ట అడ్డుగా జరిపేసి, చటుక్కున గది అవతలికి- డాబా భాగం ఒక్క గెంతు గెంతాడు. గది వెనకాల కిటికీ పక్కనే, తేలిగ్గా ఎవరికి కనపడని విధంగా కూర్చుండిపోయాడు, వీక్లీ తెరుచుకుని.

యోగారావు పక్కకి తప్పుకొని పోగా రెప్పపాటులో చకచకా మెట్లెక్కి పైకొచ్చింది అంజన గది తలుపుతోసింది. చూసింది. ఆశ్చర్యంతో కీచుగా కేకేసింది " ఈ((.. . ఇక్కడుందర్రోయ్... రండర్రోయ్... రండి, రండి!" అలా అంటూ సుందర్నీ పరీక్షగా చూసింది.

కింద కలకలం మొదలైంది. అంతా హడావిడిగా మెట్లెక్కొచ్చేసారు పైకి. " ఇష్, అరవకండి! దొంగ నిద్ర నటిస్తోంది సన్నాసి! మీరాగండి చెప్తాను " అంటూ అంజన అడుగులో అడుగేసుకుంటూ లోపలికెళ్ళి చటుక్కున దుప్పటి లాగేసింది. సుందరికదల్లేదు. ఇంచుమించు పద్మాసనం వేసుకున్నట్లుగా కాళ్ళు ముడుచుకుని, చేతులు ఒళ్ళో పెట్టుకుని, దిళ్ళ మీదుగా గోడకానుకుని, అరమూత కళ్ళతో కూర్చునే నిద్రపోతోంది. చెక్కిళ్ళలోని ఆ అందమైన గులాబీరంగు ఇంకా పోలేదు. కళ్ళలోని ఎర్రజీరలు అంతకన్నా తగ్గలేదు. నుదుటిమీద సన్నగా పొటమరించిన చెమటబిందువులు ఇంకా ఆరలేదు. అసలు, దస్సిపోయిన ఆ మొహం తీరు అరవీసం మారలేదు!

అంజన," ఒసేవ్ , సుందరీ, సుందరీ!" అంటూ సుందరి భుజం ఊపింది. సుందర్లో పెద్దమార్పులేదు, కానీ సన్నని రొప్పుతో కూడిన నిట్టూర్పొకటి ఆమె గొంతులోంచి బయటికొచ్చింది. అంజన మళ్ళీ ఊపింది. ఈసారి, సుందరి కళ్ళు కొద్దిగా తెరిచి మళ్ళీ నెమ్మదిగా మూసేసింది తల పక్కకి కొద్దిగా వాల్చి, దీర్ఘంగా నిశ్వాసం విడిచి, కాళ్ళూ చేతులూ మరి కొంచెం బిగించి, కూర్చుండిపోయింది. కానీ మరుక్షణంలో పట్టుసడిలి ఆకాళ్లూ చేతులూ వదులుగా జారాయి.

అంజన తికమకపడుతూ ఇవతలకొచ్చేసింది.... అంతా తెల్లబోయారు! అంజనంది " ఇదల్లా అయిపోయిందేమిటే! అరగంట కిందటిదాకా బాగానే ఉందిగదా?"

" మరే, ఏంటో నాకూ అర్ధంకావట్లేదు! పోనీ పరుగెత్తి శ్రమపడిందాంటే, ఆ పరుగెత్తింది మనం, చెట్టుకూ పుట్టకూను! దొంగ ఇదే అయినప్పుడు ఇది పరుగెత్తేపనేముంది!" అంది రంజితం.

కొన్ని క్షణాల తర్వాత అంజన అంది " అసలిదిక్కడికి ఎప్పుడొచ్చిందంటారు?" అంతా ఆలోచించారు. అంజనే అంది " అః అసలు మొదట్లో దాన్నిమనందాక్కోవే అన్నప్పుడే ఇక్కడికొచ్చుండాలి. ఆ తర్వాత అదిక్కడికి రావటం అసంభవం" ... " మరే, మరే!" అంది రంజితం. " సరే. వచ్చిందనుకో , ఈ పొజిలో ఎందుక్కూర్చుందంటావు? ఆ చెమటేంటి?" . " దుప్పటి కప్పుకుంది కదుటే.. అందుకని నుదుటిమీద ముత్యాలు!" అంది రంజితం.

ఇంతవరకూ మాట్లాడని శింజితం చటుక్కున అందుకుంది. " అః తెలిసింది! మన కనిపించకుండా దాక్కోటం కోసమేదుప్పటి కప్పుకుంది!"

మంజరి అందరికన్నా పెద్దది । పెళ్ళయిందీనూ - నిశితంగా పరిశీలించింది- ఒకసారి గది అవతలకున్న గుమ్మంలోంచి డాబామీదికి దేన్నో వెతుకుతున్నట్టు అనుమానంగా అటూఇటూ తొంగి చూసింది. రెండడుగులు నడిచెళ్ళిందికూడా. వెనక్కొచ్చి చూస్తూ నుంచుండిపోయింది.

సుందరిలో కదలికలేదు రంజితం వెళ్ళి మళ్ళీ సుందరిని కదపబోయింది చటుక్కున మంజరి ఆమెని వెనక్కి లాగేసింది " ఆగాగు అసలీగోలేంటో తెలుసుకోనీ ముందర !" అంది.

ఉండుండి కళ్ళు పెద్దవిచేసి, టక్కున చిటికేసి, అంజన అంది " ఆఁ తెలిసిందేవ్. యోగం, యోగం! యోగాభ్యాసం! ఇష్ష్ అంతా ఇట్లా ఇవతలకొచ్చేసెయ్యండి, ఊఁ. "

అంతా గది బయటికి, మెట్ల దగ్గిరికి వచ్చి నుంచున్నారు నెమ్మదిగా తనుకూడా బయటకొచ్చింది మంజరి. అయోమయంగా అడిగింది రంజితం " యోగాభ్యాసమా!. ఈ సన్నాసికెందుకే యోగాభ్యాసం! పైగా ఇప్పట్నించీనా!" అంజన నొచ్చుకుంది " చ్చొచ్చొ అట్లా అనకే! ఇందాకన పరుగెత్తుంటుంది దాక్కోటానికి. అప్పుడు ఏ ఊపిరి నెప్పో వచ్చుంటుంది. మరి అది పోవాలిగదా! ఉచ్ఛ్వాస నిశ్వాసాల్తో కొంచెం యోగం చేస్తోందన్నమాట!". " ఊపిరి యోగం చేసేవాళ్ళు వేగంగా గాలి పీల్చి వదుల్తొంటారు. లేదా వెల్లకిలా పడుకుని శవాసనం వేస్తారు. ఇల్లా దిళ్లకానుకుని గోడ క్కూచుంటారా?...అంటే మా తాతయ్య చేస్తూంటే చూసాన్లే, అందుకని!"

" ఏమో ఇల్లాక్కూడా ఆసనం వేస్తారేమో! లేదా, ముందరే ఆ ఆయాసపట్టమూ , శవాసనాలూ వగైరా అయిపోయాయేమో!.. మనకి తెలీని విషయం కదాఅది!.. ఏమైనా అదిప్పుడు మనమున్న స్థాయిలోకన్నా ఒకమెట్టు పైస్థాయిలోనే ఉంది. ఒక మహత్తరమైన అనుభూతిపొందుతోంది దాన్ని కదపడం మనకి మంచిది కాదు. ఏమంటారు?" ... " మరే, మరే". ఇట్లా అంటూ రంజితం గదిలోపలి తొంగిచూసింది. చట్కుక్కున ఇవతలికి అడుగేసి " చూడండే, చూడండే, ఇందాకటి ఆ ఎరుపూ, ఆ నుదుటిముత్యాలూ అన్నీ పోయాయే అంటే మనలోకంలోకొస్తోందన్నమాట మానినీమణి!" అంది. అంతా లోపలికి తొంగిచూసారు. మళ్ళీ రంజితమే అంది " యోగంలో ఉండగా మా తాతయ్య మంచి అగరొత్తులు వెలిగించి దగ్గర పెట్టుకునేవాడు కనీసం ఇప్పుడయితా రెండు వెలిగించి దీని దగ్గర పెడితే సంతోషిస్తుందేమోనే పాపం" .. చటుక్కున శింజితం " అయితే కిందికెళ్ళి పెళ్ళివారి స్టోర్‌రూంలోంచి రెండు పట్టుకొస్తానాగండీ" అంటూ వెళ్ళబోయింది.

" ఆగాగు!" అంటూ ఆమె రెక్కపట్టుకొని ఆపింది రంజితం " యోగమయ్యాక మా తాతయ్య గ్లాసెడు పాలు తాగేవాడు వీలుంటే అవ్వికూడా చూడు" అంది.

" అల్లాగేలే" అంటూ శింజితం గబగబా మెట్లు దిగెళ్ళిపోయింది. .. ఇంతవరకూ మౌనంగా ఉన్న మంజరి, ఏదో ఆలోచిస్తున్నట్లుగా లోపలికి మళ్ళీ తొంగిచూసింది. నెమ్మదిగా ఇవతలికి అడుగేసి బయటి గుమ్మంలోంచి అటూ ఇటూ పచార్లు చెయ్యటం మొదలుపెట్టింది. మూడునిమిషాల్లో గ్లాసెడుపాలూ, సుగంధ శృంగార్ అగరొత్తుల కట్టా, వెండి అగరొత్తుల స్టాండూ, లడ్డూలప్లేటూ, అగ్గిపెట్టే-వీటితో వచ్చేసింది శింజితం.

అంతా నిశ్శబ్దంగా లోపలికెళ్లారు. అగరొత్తులు వెలిగించి సుందరి పక్కనే పెట్టారు. ప్లేట్లో లడ్డూలు, గ్లాసులో పాలుకూడా పక్కనే పెట్టారు. అంతా ఆమె కెదురుగా వారపత్రికల కట్టల మీద కూర్చున్నారు.

అగరొత్తెల వాసన ముక్కుల్లోక్కొట్టింది సుందరికి నెమ్మదిగా కళ్ళు తెరిచింది. చూసింది ఆత్రంగా తనవేపే చూస్తూకూర్చునున్న తన స్నేహితురాళ్ళ మొహాలు కనిపించాయి. పక్కకి చూసింది గ్లాసులో పాలూ, ప్లేట్లో లడ్డూలు కనిపించాయి సుందరి కనుబొమలు " ఇదంతా ఏమిటి?" అన్నట్లు ముడిపడ్డాయి.

అంజన అంది " చెప్పాపెట్టకండా అట్లా యోగంలో పడిపోతే ఎట్లాగే ! హడిలిచస్తున్నాం ఇందాకట్నుంచీ!" తడబడుతున్న మాటల్లో సుందరంది " యోగమా?"

చటుక్కున రంజిత అంది " నువ్వు యోగాభ్యాసం చెయ్యటం మాకానందమే. ఎందుకంటే అది ఒంటికి ఆరోగ్యం గనక, అయితే మరి ఆ తర్వాత ఒంట్లో వేడిపుట్టి శక్తి ఖర్చవుతుందిగదా, పాలూ పళ్ళూ దగ్గర పెట్టుకోరటే తెలివీ!. అందుకనే గురువు దగ్గర్లేకుండా యోగాభ్యాసం చెయ్యకూడదంటారు. మా తాతయ్య లాంటి పెద్దలు! పోనీ నాతో చెప్పినా నేనివ్వన్నీ ఏర్పాటు చేసేదాన్నిగాదా!"

సుందరికి పరిస్థితి అర్థమయింది. బొమల్లో ముడిసడిలింది. ఆమె కళ్ళు మూసుకుంది. నాలుగు క్షణాలాలోచించింది. నవ్వు మొహంతో కళ్లు తెరిచి అంది " ఏంటోనే, పరిగెత్తానూ, ఆ ఆయాసంతో అట్లాగే పడిపోయి యోగాభ్యాసం చేశానూ మీరేమో ఎక్కడో ఉండిపోయేరాయె చెప్పటానికి!.. సర్లే, మీరు బయటికెడితే నేను లేచొస్తాను" ... అంజని పాలగ్లాసందిస్తూ " తాగుముందర!" అంది

సుందరి రెండు క్షణాలాలోచించింది. గ్లాసందుకొని పాలు తాగేసింది. చేత్తో అందర్నీ బయటకెళ్ళమని సంజ్ఞచేసింది. అంతా బయటక్కదిలారు

" సరే, మేం కిందుంటామే, ఆసామాను తీసుకొచ్చేయ్" అన్నారు. ఆవెంటనే మెట్లు దిగివెళ్లిపోయారు. సుందరి లేచింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. బట్టలు సర్దుకుంది.గోళ్ళతో తలదువ్వుకుంది. కిటికీ కాంతిలో పళ్ళెంలో మొహం చూసుకుని బొట్టు దిద్దుకుంది. నాలుగు నిముషాల తర్వాత నెమ్మదిగా బయటకొచ్చింది.

అదే సమయానికి కిటికీలోంచి గదిలోకి చూసి యోగారావు కూడా గబగబా లోపలికొచ్చేసాడు. సుందర్ని చూసి ఏదో అనబోయాడు. సుందరి కోపంగా ' వెళ్ళిపొమ్మ'ని సంజ్ఞ చేసింది. యోగారావు మెట్లుదిగి వెళ్ళిపోయాడు. గది తలుపు మూసింది సుందరి. కదలబోయింది. డాబామీంచి టక్కున ప్రత్యక్షమయింది మంజరి. సుందరి చెయ్యిపట్టుకుని తీక్షణంగా అడిగింది. " ఎవరే ఆ వెళ్ళింది మీ ఆయనకదూ?" సుందరి బిక్క మొహం వేసింది. " అవును" .. " ఇందాకట్నుంచీ ఆ కిటికీ పక్కన నక్కి ఉన్నాడు గదూ!"... " ఊం... ఏమో!" ... " ఇందాకట్నుంచీ నువ్వున్నదీయోగంలేనే కదూ!" సుందరి దిగులు మొహం పెట్టేసింది. గొంతు గాద్గదికం కాగా మంజరి చేతులు రెండూ పట్టుకొని బతిమాలుతూ అంది. " ప్లీజ్, ప్లీజ్ అల్లరి చెయ్యకే! నాపరువుతియ్యకే!.. ఏం చెయ్యను అట్లా అయిపోయింది మరి!" పకపకా నవ్వింది మంజరి " ఆల్‌రైట్! నీ రహస్యం కాపాడతాను. మరి నాకేమిస్తావ్?" ... వెలతెలాబోతూ అంది సుందరి " ఇవ్వటమేంటి ఏమివ్వను!" ... " ఇస్తానంటే చెబుతా"... " అట్లాగే , చేతనైతే.."

" సరేవిను. మా శ్రీవారు ఇప్పుడే వచ్చారు. రాత్రంతా ప్రయాణంచేసి. బాగా బడలిగ్గా ఉన్నారు. బహుశా నేను కూడా యోగంలోకి వెళ్ళవలసి రావచ్చు... ఈ గదిలోనే కావచ్చు" మళ్ళీ తెల్లబోతూ అంది సుందరి " అయితే" .. " మెట్లకింద నువ్వు కాపలావుండు!"... "ఛత్!"..." అయితే నీ యోగసమాధివిషయం చాటేస్తా" మంజరి మొహంలోకి తీక్షణంగా చురుగ్గా చూసి నవ్వింది, సుందరి " సర్లే!" అంది. ఇద్దరూ నవ్వారు పకపకా నవ్వుతూ కిందికి కదిలారు.

(స్వాతి సపరివార పత్రిక 27-12-85)

★★★ ★★★ ★★★